# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 19-10-2025 సమయం : రాత్రి 8 గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దీపావళి సందర్భంగా దేశ పౌరులకు శుభాకాంక్షలు తెలిపారు.
- జేఈఈ మెయిన్-2026 కంప్యూటర్ ఆధారిత పరీక్ష (CBT)కు సంబంధించి షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) విడుదల చేసింది.
- గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ను సాధించిన రామజన్మభూమి అయోధ్య దీపోత్సవం.
- మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా ఇండోర్ వేదికగా జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ లో ఇంగ్లాండ్ 289 పరుగుల లక్ష్యాన్ని భారత్‌కు నిర్దేశించింది.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26న ప్రసారమవుతుంది.

===================

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దీపావళి సందర్భంగా దేశ పౌరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ చీకటిపై వెలుగు, అజ్ఞానంపై జ్ఞానం, చెడుపై మంచి విజయాన్ని సూచిస్తుందని తన సందేశంలో ఆమె పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా అపారమైన ఉత్సాహంతో జరుపుకునే దీపావళి శుభ సందర్భం పరస్పర ఆప్యాయత, సోదరభావాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ దీపావళి సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. లక్ష్మీదేవి ప్రతి ఒక్కరిపై శాంతి, శ్రేయస్సు, మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు తన సందేశంలో పేర్కొన్నారు.

===================

జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్-2026 కంప్యూటర్ ఆధారిత పరీక్ష (CBT)కు సంబంధించి షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) ఈ రోజు విడుదల చేసింది. జనవరి 21 నుంచి 30వ తేదీ మధ్య జేఈఈ మెయిన్ మొదటి సెషన్, ఏప్రిల్ 1 నుంచి 10వ తేదీల మధ్య రెండవ సెషన్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. అయితే, ఈ పరీక్షలు జరిగే కచ్చితమైన తేదీలను తర్వాత ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. జేఈఈ మెయిన్

సెషన్ -1 పరీక్షకు ఈ నెల నుంచే ఆన్‌లైన్ దరఖాస్తులు వెబ్‌సైట్‌లో అందుబాటులోకి వస్తాయని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (NTA) పేర్కొంది.

==================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

==================

దేశ అంతర్గత భద్రత విషయంలో రాజీ పడేది లేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ రోజు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.... దేశ భద్రతకు ముప్పుగా పరిణమించే వాళ్లు ఎవరైనా సరే ప్రభుత్వం నుంచి తప్పించుకోలేరని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు మావోయిస్టు వ్యవస్థ నిర్మూలనకే పరిమితం కావడం లేదని, అవినీతి, నేరం, ఉగ్రవాద సంబంధాల నెట్‌వర్క్‌ను సైతం వెలికి తీస్తున్నాయని తెలిపారు.

==================

బీహార్ అసెంబ్లీ ఎన్నికల రెండవ దశ నామినేషన్ల గడువు రేపటితో ముగియనుంది. రెండవ దశలో రాష్ట్రంలోని 20 జిల్లాల్లోని 122 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నవంబర్ 11న పోలింగ్ జరుగుతుంది. అభ్యర్థులు ఈనెల 23వ తేదీ వరకు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు జరిగేలా చూసేందుకు పోలీసులు, వివిధ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అక్టోబర్ 6న ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుండి 2 కోట్ల 73 లక్షల విలువైన నగదు, 22 కోట్ల రూపాయల విలువైన మద్యం, 16 కోట్ల 21 లక్షల రూపాయల విలువైన మాదకద్రవ్యాలు, 5 కోట్ల రూపాయల విలువైన లోహాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంతే కాకుండా ఓటర్లకు పంపిణీ చేయడానికి ఉద్దేశించిన దాదాపు 12 కోట్ల రూపాయల విలువైన బహుమతులు, ఉచిత వస్తువులు కూడా పట్టుబడ్డాయి.

==================

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రామజన్మభూమి అయోధ్యలో 9వ దీపోత్సవం అంగరంగ వైభవంగా ఈ రోజు నిర్వహించారు. 26 లక్షల 17 వేల 215 దీపాలను వెలిగించి, ఈ దీపోత్సవం గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ను సాధించింది. సరయు నదిలో 56 ఘాట్ల వద్ద 33 వేల మంది స్వచ్ఛంద సేవకులు ఈ దీపాలను ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ ఈ దీపోత్సవాన్ని ప్రారంభించారు. శ్రీరాముడు, సీతమ్మ, లక్ష్మణ వేషధారులకు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యానాథ్ హారతి ఇచ్చి రథాన్ని లాగారు. సరయు నది ఒడ్డున 2,128 మంది వేదపండితులు మహా హారతి నివేదించి, శ్లోకాలను పఠించారు. 1,100 స్వదేశీ డ్రోన్లు అయోధ్య మీదుగా ఆకాశంలో రామాయణ దృశ్యాలను ప్రదర్శించాయి.

విరామం

==================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించి, గత నెల 22న ప్రారంభించిన `జీఎస్టీ బచత్ ఉత్సవ్` సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తోంది. GST సంస్కరణలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిచ్చాయి. చేనేత, హస్తకళలు, పాడి పరిశ్రమ, సిమెంట్ వంటి కీలక రంగాలలో 5 నుండి 18 శాతం వరకు GST రేట్ల తగ్గింపుతో ఆయా రంగాలలో డిమాండ్ పెరిగింది. చేతివృత్తుల వారికి సహకారం లభించడంతో పాటు, కొత్త ఉద్యోగాల కల్పనకు అవకాశం కలుగుతుంది. అదే విధంగా సిమెంట్ రంగంలో GSTని 18 శాతానికి తగ్గించడంతో ఖర్చులు తగ్గి, గృహ నిర్మాణ రంగం

ఊపందుకుని 20 వేల నుండి 30 వేల ఉద్యోగాలను కొనసాగించేందుకు ఉపకరించింది. అంతే కాకుండా గిరిజన, అటవీ చేతి పనులపై GSTని 5 శాతానికి తగ్గించడంతో మార్కెట్ డిమాండ్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో 10 నుండి 15 శాతం పెరిగింది. అలాగే 2026 నాటికి దాదాపు 5 వేల కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని అంచనా. ఇదిలా ఉండగా ఆ రాష్ట్రంలో ప్యాకేజ్డ్ పాల ఉత్పత్తులపై GST తగ్గింపుతో వాటి వినియోగం పెరిగి 15 వేల నుండి 20 వేల ఉద్యోగాలకు మద్దతు లభించింది. జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి బోర్డు 2028 నాటికి దాని ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని ఆరు రెట్లు విస్తరించడానికి అవకాశం కలిగింది.

==================

పోలీసు అమర వీరుల స్మారక దినోత్సవం సందర్భంగా అక్టోబర్ 21వ తేదీన న్యూఢిల్లీలోని జాతీయ పోలీసు స్మారక చిహ్నం వద్ద పోలీసు అమరవీరులకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాళులర్పిస్తారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్‌లో భారీగా ఆయుధాలు ధరించిన చైనా దళాల దాడిలో మరణించిన 10 మంది వీర పోలీసుల త్యాగానికి గుర్తుగా ప్రతి ఏటా ఆ రోజున పోలీసు స్మారక దినోత్సవాన్ని పాటిస్తున్నారు. ఈ సందర్భంగా కేంద్ర సాయుధ పోలీసు దళాలు (CAPF), ఢిల్లీ పోలీసుల సంయుక్త కవాతు జరుగుతుంది.

==================

కేరళ, మాహే, లక్షద్వీప్‌లలో రాబోయే రెండు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. కేరళ, కర్ణాటక తీరాలు, లక్షద్వీప్, కొమోరిన్ ప్రాంతంతో సహా, వాటిని ఆనుకుని ఉన్న సముద్ర ప్రాంతాలలో గంటకు 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని IMD తెలిపింది. మరిన్ని వివరాలను వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ శశికాంత్ మిశ్రా వెల్లడిస్తూ..

(వాయిస్ 29 సెకన్లు)

==================

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా ఈరోజు భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య ఇండోర్ వేదికగా క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లాండ్ 50 ఓవర్లకు 8 వికెట్లు నష్టపోయి 288 పరుగులు చేసింది. అనంతరం 289 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన భారత్ 23 ఓవర్లు పూర్తయ్యే సరికి 2 వికెట్ల నష్టానికి 120 పరుగులు చేసింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ నాలుగు, శ్రీ చరణి 2 వికెట్లు తీశారు.

అదేవిధంగా ఆస్ట్రేలియాలోని పెర్త్ వేదికగా ఈరోజు పురుష జట్ల మధ్య జరిగిన తొలి వన్డే క్రికెట్ మ్యాచ్‌లో భారత్‌పై ఆస్ట్రేలియా 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. వర్షం కారణంగా ఆటను 26 ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 136 పరుగులు చేసింది.

==================

==================